# ముద్ర

-ప్రవీణ

ఆ రోజు ఆదివారం సెలవుదినం కావడంతో కాస్త ఆలస్యంగా నిద్ర లేచిన లావణ్య మొహం కడుక్కుని రేడియో స్విచ్ ఆన్ చేస్తూ వంటింట్లోకి వెళ్లింది. 'తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది' రేడియోలో నుండి వెలువడుతున్న ఆ పాటను వింటూ కాఫీ కలుపుకుంటోంది. ఇంతలో కాలింగ్ బెల్ మోగడంతో వెళ్లి తలుపు తెరిచింది. పాల బ్బాయి నిలబడి వున్నాడు.

రోజూ డోర్ పక్కనే పెట్టి ఉంచిన బుట్టలో పాల ప్యాకెట్స్ పెట్టేసి వెళ్లిపోతాడు. ఈరోజు బెల్ కొట్టి ఆగాడంటే ఒకటవ తేదీ కావచ్చు, పాల బిల్ కోసం ఆగాడు అనుకుంటూ క్యాలెండర్ వైపు చూసింది. అవును ఒకటవ తేదీ నవంబర్ నెల.

'ఓ... అయితే ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం. అందుకేనేమో రేడియోలో ఆ పాట వేశారు' అనుకుంటూ బీరువాలోంచి డబ్బులు తెచ్చి పాలబ్బాయికి ఇచ్చింది.

"థాంక్స్ మేడమ్" అంటూ వాడు వెళ్లిపోయాడు.

రేడియోలోంచి మరో పాట వినబడింది 'తెలుగువీర లేవరా దీక్షబూని సాగరా' అంటూ.

అసలే తెలుగు అభిమాని అయిన లావణ్య ఆ పాటకు పులకరించిపోతూ పాకెట్లలోని పాలు గిన్నెలోకి వంపి స్టవ్ మీద పెట్టింది.

మళ్లీ కాలింగ్ బెల్ మోగింది. వెళ్లి తలుపు తెరిచింది. న్యూస్ పేపర్ ఆమె చేతిలో పెట్టిన పేపర్ కుర్రాడు "ఆంటీ! పేపర్ బిల్లు డబ్బులిస్తారా?" అడిగాడు.

ఆంటీ అన్న పిలుపు ఆమె చెవులకు కర్ణకఠోరంగా వినిపించింది. ఇలా ఆంటీ, మేడమ్ అని పిలిచే బదులు ఎంచక్కా అమ్మగారూ అనో లావణ్యగారూ అనో పిలవవచ్చుగా అనుకుంది. ఆమె పేపరు బిల్లు చెల్లించి లోపలికి వచ్చింది. రేడియోలో ఈసారి మరో పాట వినబడసాగింది.

'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా గతమెంతో ఘన కీర్తి కలవాడా'

ఆహా ఎంత చక్కటి పాటలు వేస్తున్నారు అనుకుంది. ఆ పాటలు ఆమె వీనులకు విందు చేస్తున్నాయి. ఆమెకు తన శరీరమంతా తెలుగుతేజంతో వెలిగిపోతున్నట్లు అన్పించసాగింది.

"అబ్బా... లావణ్య! గందరగోళంగా ఏంటా పాటలు. కాస్త ఆ రేడియో ఆపెయ్యి. సెలవురోజన్నా కాసేపు పడుకోనివ్వవు" విసుగ్గా అరిచాడు భాస్కర్.

"మామ్! కాంట్ యూ స్విచ్ ఆఫ్ ద సిస్టమ్" పిల్లలిద్దరూ ఒకేసారి అరిచారు.

ఇక లాభం లేదనుకుని అయిష్టంగానే రేడియో ఆపేసి తన పనిలో తను నిమగ్నమయింది.

***

లావణ్యకు దేశ భాషలందు తెలుగు లెస్స అన్న నానుడి చిన్ననాడే బాగా వంటబట్టింది. కాన్వెంట్‌లో చదివినా కూడా వీలయినంతవరకూ ఇంగ్లీషు పదాలు దొర్లకుండా చక్కటి తెలుగు మాట్లాడుతుంది. తెలుగులో ఎంఏ చేసి తెలుగు లెక్చరర్‌గా జాబ్ చేస్తోంది. భర్త వద్దని వారించినా వినకుండా తన పిల్లలిద్దర్నీ స్కూల్లో చేర్చేటప్పుడు సెకెండ్ లాంగ్వేజ్ తెలుగు ఇప్పించింది.

"తెలుగు లాంగ్వేజ్ చదవడానికీ, రాయడానికీ చాలా కష్టంగా వుంటుంది. ఇతర భాషలకంటే తెలుగు బోధించేవాళ్లు, పరీక్ష పేపర్లు దిద్దేవాళ్ళు చాలా కఠినంగా వ్యవహరిస్తారు. వద్దు లావణ్యా బాగా ఆలోచించుకో. ఇది పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన విషయం" అని అతడు ఎంతో చెప్పి చూసాడు.

కానీ లావణ్య వినలేదు. "నా పిల్లలకు నేను తెలుగు చక్కగా చెప్పగలను" అన్నది సగర్వంగా.

ఇక విధిలేక భాస్కర్ ఒప్పుకున్నాడు.

ఇప్పుడు లావణ్య కొడుకు శ్రేయస్ స్టేట్ సిలబస్‌తో పదవ తరగతీ, కూతురు శ్రావ్య సెంట్రల్ సిలబస్‌తో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు.

లావణ్య గోడ గడియారంలో టైమ్ చూసింది. తొమ్మిదిన్నర అవుతుంది. గదిలోకి వెళ్లి పిల్లలిద్దర్నీ లేపి ముఖాలు కడుక్కుని స్నానాలు చేయమంది. సెలవుదినంవల్ల టిఫినేమీ చేయకుండా ఒకేసారి లంచ్‌కి వంటకాలు సిద్ధం చేయసాగింది. పనబ్బాయిని కూరలకని మార్కెట్‌కి పంపి వాడొచ్చే లోపల సున్నుండలు చేసి డబ్బాలో సర్దింది. మార్కెట్ నుండి కుర్రాడు తెచ్చిన గోంగూర నూనెలో వేయించి గ్రైండ్‌లో వేసి పచ్చడి నూరి బాగా కరివేపాకు, ఎండుమిరపకాయలు వేసి ఘుమఘుమలాడేటట్లుగా తాలింపు వేసింది.

కోడిమాంసం కడిగి మసాలా బాగా దట్టించి కోడి ఇగురు చేసింది. అన్నం వండి పులిహోర కలిపి అన్నింటినీ డైనింగ్ టేబుల్‌పై సర్ది పెట్టింది.

పని పూర్తవగానే తనూ వెళ్లి స్నానం చేసి వచ్చేసరికి ఒంటిగంట అయింది.

"మామ్! ఆకలి దంచేస్తోంది. వాట్స్ దేర్ టు ఈట్" పిల్లలిద్దరూ డైనింగ్ టేబుల్‌పైన వున్న డిష్‌ల మూతలు తీసి చూసారు.

"ఇవన్నీ ఏమిటి మమ్మీ. చికెన్ బిర్యానీయో చేయవచ్చుకదా. హాలిడే మూడ్ అంతా పోయింది" విసుగ్గా అన్నాడు శ్రేయస్.

"అవన్నీ ప్రతి సండే చేసేవేకదా. వెరైటీగా వుంటుందని ఈ రోజు ఇవి చేసాను. చాలా రుచిగా ఉంటాయి తిని చూడు" అన్నది లావణ్య.

"నో వే మమ్మీ" అని అక్కడే వున్న భాస్కర్‌తో "డాడీ! కెన్ ఐ ఆర్డర్ మై లంచ్ ఫ్రం పిట్జా కార్నర్" అన్నది శ్రావ్య.

భాస్కర్ సరేనన్నట్లుగా తల వూపాడు. ఒకవేళ తను ఫుడ్ పార్శిల్ వద్దన్నా కూడా వాళ్ళు ఈ వంటకాలు తినరని అతనికి బాగా తెలుసు.

తను ఎంతో కష్టపడి చేసిన వంటలు పిల్లలు తినకపోవడంతో చిన్నబుచ్చుకున్న లావణ్య ఏదో గతికినట్లుగా తిని అన్నీ డిష్‌లూ ఫ్రిజ్‌లో సర్దేసింది. అవి రేపు పనిమనిషి పాలేనని తెలుసు.

ఆ తరువాత కాసేపు నడుం వాలుద్దామని పడకగదిలోకి వెళ్లబోయిన లావణ్య కాలింగ్ బెల్ మోగడంతో వెళ్లి తలుపు తెరిచింది. తన స్నేహితురాలు లత పిల్లలతో వచ్చింది.

"ఈరోజు సెలవుకదా నువ్వూ పిల్లలు ఇంట్లోనే వుంటారని వచ్చా" అన్నది.

వాళ్ళు ఎక్కడికో వెళ్లి వస్తున్నట్లున్నారు. ముఖాలు బాగా అలసటగా ఉన్నాయి. పిల్లల ముఖాలకు మేకప్ వేసి తీసినట్లుగా అక్కడక్కడ మేకప్ ఛాయలు కనబడుతున్నాయి.

"ఈరోజు నవంబర్ ఫస్ట్‌కదా. శిల్పారామంలో డాన్స్, ఫ్యాన్సీ డ్రెస్‌ల పోటీలు వుంటే పిల్లల్ని అక్కడికి తీసుకెళ్లి వస్తున్నాను. ఇద్దరికీ బహుమతులు వచ్చాయి. దీనికి కూచిపూడి నృత్యంలో ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. వాడికి ఫ్యాన్సీ డ్రెస్ పోటీలో రెండవ

బహుమతి వచ్చింది'' గబగబా గుక్క తిప్పుకోకుండా చెప్పసాగింది లత.

"ఓ అలాగా! ఇది చాలా గొప్ప విషయమే'' అని పిల్లలవైపు తిరిగి "కంగ్రాట్స్'' అంటూ బాబుని దగ్గరకు తీసుకుని "నీకే వేషానికి బహుమతి వచ్చింది'' అనడిగింది.

"తాతగారి వేషం'' అన్నాడు వాడు కాస్త విసుగ్గా ముఖం పెట్టి.

"తాతగారి వేషమా? అదేంటి?'' అర్థం కానట్టు అడిగింది మళ్లీ.

"ఏమో ఆంటీ! మేకప్ మాన్ వేషం వేసాడు. చేతికి కర్ర ఇచ్చారు. నన్ను దగ్గుకుంటూ స్టేజీపైకి ఎక్కి కర్ర పట్టుకుని ముసలతనిలా వంగి అలా అలా నడిచి రమ్మన్నారు'' అన్నాడు వాడు.


ఇంతలో లత కలుగజేసుకుంటూ "అదేనే టంగుటూరి ప్రకాశంపంతులు అంటారు చూడు ఆ వేషం. అంతంతలేసి పెద్ద పేర్లు వీడికేం గుర్తుంటాయి. అయినా ఏదో పెద్దాయన కదా అనుకుని తాత అన్నాడు'' అనేసింది.

"మొన్నామధ్య మీ ఆడపడుచు మార్కెట్‌లో కలసినప్పుడు చెప్పింది నీ కూతురు కూచిపూడి నృత్యం నేర్చుకుంటోందని. కానీ ఇంత త్వరలో బహుమతి గెల్చుకునేటంతలా నేర్చుకోవడం గొప్ప విషయం. మన సంస్కృతి, సంప్రదాయాలకు విలువనిచ్చి ఎంతో శ్రద్ధగా నువ్వు పిల్లలకు ఇలాంటి కళలలు నేర్చుకునే అవకాశం కలగజేయడం అభినందించదగ్గ విషయమే'' అన్నది లావణ్య.

"ఆ సంస్కృతా పాడా! పోయిన ఏడాది ఈ పోటీల్లో నీలిమ కూతురుకు మొదటి బహుమతి వచ్చిందని ఎంత గొప్పలు పోయిందనీ. దాని పిల్లలకంటే నా పిల్లలకేం తక్కువ పోయిందని... అందుకే వెంటనే నేనూ దీన్ని డాన్స్ క్లాస్‌లో చేర్చాను. ఆరునెలలు ఈ బహుమతికోసం అహోరాత్రులు ప్రాక్టీస్‌కి తీసుకెళ్లా. డాన్స్ మాస్టార్లకు బోలెడు డబ్బు గుమ్మరించా. ఆఖరికి నా కష్టం ఫలించింది'' అన్నది లత.

ఈ మాటలు విన్న లావణ్య బిత్తరపోయింది. అంటే డాన్స్ నేర్పింది పేరు కోసం, గొప్పకోసం అన్నమాట అనుకుంటూ పాపని దగ్గరకు తీసుకుని "అయితే డాన్స్ నేర్చుకోవడం నీకిష్టమేనా పాపా. చాలా కష్టపడి ప్రాక్టీస్ చేసినట్టున్నావు'' అనడిగింది.

"లేదాంటీ. నాకీ డాన్స్ చేయడం చాలా కష్టంగా వుంది. ఆరునెలలుగా నేను స్కూల్‌కి సరిగ్గా వెళ్లలేకపోయాను. దానివల్ల ఏ లెసెన్స్ చదివినా సరిగ్గా అర్థం కావడంలేదు. వచ్చేవారం నుండి హాఫ్ ఇయర్లీ పరీక్షలు వున్నాయి. ఎలా రాయాలో తెలియడంలేదు'' అన్నది దిగులుగా.



ఈ పసి ముఖంలో బహుమతి గెలిచానన్న సంతోషంకంటే పరీక్షలెలా రాయగలనో అన్న టెన్షనే ఎక్కువగా కనబడుతోంది.

దాని మాటలువిన్న లత "దాని మొహం. దానికేం తెల్సు. అన్ని సబ్జెక్టులకూ ట్యూషన్స్ పెడితే సరి ఆన్యువల్ పరీక్షలకు అన్నీ అదే నేర్చుకుంటుంది'' అనేసింది తేలిగ్గా.

ఇంతలో పక్కనుండి నీరసమైన గొంతుతో "మీ ఇంట్లో తినడానికి ఏమైనా వుంటే పెడతారా ఆంటీ. బాగా ఆకలిగా వుంది'' అడిగాడు లత కొడుకు.

"అయ్యో నా మతిమండా. అక్కడ ప్రోగ్రాంలో బహుమతులు గెలిచిన సంతోషంలో మధ్యాహ్నం భోజనం సంగతే మరిచాను'' అన్నది నాలిక్కరుచుకుంటూ లత.

ఆకలితో శోష వచ్చి పడిపోయే స్థితిలో వున్న ఆ పిల్లలిద్దరికీ అంతకుముందే తను ఫ్రిజ్‌లో పెట్టిన కూరలూ, పులిహోరా మైక్రోవేవ్‌లో వేడి చేసి నిముషాల్లో వడ్డించింది లావణ్య. వాళ్లెంత ఆకలిగా వున్నారోగానీ పిసరు కూడా మిగల్చకుండా అంతా తినేసారు. తను కష్టపడి వండిన వంటలు అలా సద్వినియోగం అయినందుకు సంతృప్తిపడింది లావణ్య. ఆ తరువాత కాసేపుండి లతా వాళ్ళు వెళ్లిపోయారు. సమయం అయిదయింది. ఈ రోజు సాయంకాలం రోజులా ఆడుకోవడానికి పిల్లలు బయటకు వెళ్లనట్టున్నారు అనుకుంటూ వాళ్ల గదిలోకి వచ్చింది. ఇద్దరూ చెరో మూలా కూర్చుని చదువుకుంటున్నారు.

గదిలోకి వచ్చిన తల్లిని చూసి శ్రేయస్ "మమ్మీ కాస్త ఈ మదర్ థెరిస్సా పాఠం చెప్పవూ. చాలా కష్టంగా వుంది'' అంటూ పిలిచాడు.

లావణ్య వాడిచ్చిన పుస్తకం తీసుకుని చూసింది. అది తెలుగు పాఠ్య పుస్తకం.

ఆమె రెండు పేజీలు వరకు చదివి శ్రేయస్‌ని కూడా చదవమన్నది. చాలా కఠినమైన భాషతో క్లిష్టమైన పదాలతో ఉన్న ఆ పాఠాన్ని వాడు సరిగ్గా చదవలేకపోయాడు. ఆమె కొన్ని పదాలు డిక్టేషన్ ఇచ్చింది. అన్నీ తప్పులే రాసాడు. మదర్ థెరిస్సా అసలు పేరు, ఆమె పుట్టిన దేశం వందసార్లు ప్రాక్టీస్ చేయమని చెప్పి బయటకు వస్తుంటే వాడు ఉక్రోషంగా-

"వాట్ ద హెల్ ఈజ్ దిస్. ఈవిడ ఎందుకు పుట్టిందో, ఆవిడ గురించి ఎందుకు చదవాలో" అన్నాడు కసిగా.

ఆ మాటలు విన్న లావణ్య గిరుక్కున వెనక్కితిరిగి వాడి చెంపమీద చాచి కొట్టింది. ఆ దెబ్బతో శ్రేయస్ కళ్లల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"అంతటి మహనీయురాలిని ఎంత మాటన్నావు?" అంది కోపంగా.

"మమ్మీ! ఇందులో నిజంగా అన్నయ్య తప్పేమీలేదు. నిజంగానే తెలుగు సబ్జెక్ట్ చాలా టఫ్‌గా ఉంది. నాకీసారి యూనిట్ పరీక్షల్లో కూడా తెలుగు కారణంగానే క్లాస్ ఫస్ట్‌ర్యాంక్ మిస్సయ్యింది. ఉర్దూ, హిందీ లాంగ్వేజ్‌వాళ్ళు వాళ్ళ ఆన్సర్ షీట్స్‌ని ఈజీగా కరెక్ట్ చేస్తారు. మన తెలుగు లాంగ్వేజ్ పేపర్స్‌ని టఫ్‌గా కరెక్ట్ చేస్తారు. ఈసారి మాకు తెలుగు బుక్‌లో గాంధీగారు స్వయంగా రచించిన జీవిత చరిత్రను అనువదించి పెట్టారు. చూడు మమ్మీ ఎంత టఫ్‌గా వుందో" అంటూ లావాటి పుస్తకం తెచ్చి లావణ్య చేతికిచ్చింది.

"సర్లే అక్కడ పెట్టు. తరువాత చూస్తాను" అంటూ గది బయటకు వచ్చి అక్కడ కుర్చీలో కూర్చుండిపోయింది చాలాసేపు వాడిని అనవసరంగా కొట్టానన్న బాధతో. ఆ కఠినమైన భాష చదివి అర్థం చేసుకోలేక ఆ కోపం ఇలా వెళ్లగక్కుతున్నారు.

"చీకట్లో కూర్చున్నావేంటి?" అంటూ భాస్కర్ లైట్ వేయడంతో ఉలిక్కిపడ్డట్టుగా అయింది లావణ్య. ఆమె ఉలికిపాటుతో లేవడంవలన ఒళ్లో వున్న పుస్తకం కిందపడింది. ఆమె దాన్ని చేతిలోకి తీసుకుని తిరగేసింది. అందులో మదర్ థెరిస్సా, కృష్ణానది, టెలివిజన్, మామిడిపండు, జగదీస్ చంద్రబోస్ ఇలాంటి పాఠ్యాంశాలే వున్నాయి. హిస్టరీ, జాగ్రఫీ, బయాలజీలలో తప్పనిసరిగా చదువుకునే పాఠ్యాంశాలే తెలుగు భాషాబోధన పుస్తకంలో పెట్టాలా? మిత్రలాభం, మిత్రభేదం, భాగవతం, రామాయణం, మహాభారతంలోని కథలు పెట్టి పిల్లలకు ఉత్సాహం కలిగేలా సరళంగా బోధిస్తే ఎంత బావుంటుంది?

***

ఆ ఏడు శ్రేయస్ పదవ తరగతి తప్పాడు. అన్ని సబ్జెక్టుల్లోనూ ఎనభై శాతం మార్కులు తెచ్చుకుని తెలుగులో ఒక్క మార్కు తక్కువ రావడంతో తప్పాడు.తనకున్న మాతృభాషాభిమానమే ఈ పరిస్థితికి కారణమేమోనన్న గిల్టీ ఫీలింగే ఆమెని మరింత బాధపెట్టింది.


"ఇందులో నీ తప్పేమీలేదు లావణ్యా. మాతృభాషను నీ పిల్లలు నేర్చుకోవాలన్నది సదుద్దేశ్యమే కానీ భాషా బోధనకి సంబంధంలేని పాఠ్యాంశాలు, అతి కఠినమైన పదజాలం ఉపయోగించి పిల్లల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు. సరళమైన భాషతో మళ్లీ మళ్ళీ చదవాలనిపించే పాఠ్యాంశాలను పొందుపరచి భాషాబోధన పుస్తకాలను ప్రచురించేటట్లుగా శ్రద్ధ వహించి మన విద్యాశాఖ ఆ పుస్తకాలను విద్యార్థులకు అందిస్తే ఇకముందు ఇలాంటి సమస్యలు కలుగకుండా నియంత్రించవచ్చు. ఈ సమస్య మన ఒక్కరిదే కాదు, ఎంతో మంది విద్యార్థులు, వాళ్ల పేరెంట్స్ ఇలాంటి సమస్యను ఎదుర్కొని వుంటారో ఆలోచించు" అని ఎంతగానో నచ్చచెప్పాడు.

***

శ్రేయస్‌ని ఇన్‌స్టంట్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ చేయిస్తూ అలాగే తెలుగు సబ్జెక్టుపై పేరుకుపోయిన భయాన్ని తొలగించడానికి కౌన్సిలింగ్‌కి తీసుకెళ్లసాగారు. కానీ అంతలోనే ఆ ఏడు పదవ తరగతి ఫలితాల పర్సెంట్ బాగా తగ్గడంతో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌వారు ఒక సబ్జెక్టులో ఫెయిలయిన స్టూడెంట్స్‌కి ఐదు గ్రేస్ మార్కులు కలపాలని నిర్ణయించుకోవడంతో అదృష్టవశాత్తు శ్రేయస్ గట్టెక్కాడు. అంతే! ఆ తరువాత అతనెన్నడూ చదువులో వెనుదిరిగి చూడలేదు. ఇంటర్‌లో సంస్కృతం సెకెండ్ లాంగ్వేజ్‌గా తీసుకుని తొంభై ఏడు శాతం మార్కులు తెచ్చుకుని ఆ పర్సంటేజ్‌తో బిట్స్‌పిలానీలో సీటు సంపాదించాడు.

అతను చిన్ననాడు తెలుగు భాషాబోధనలో చదివిన మామిడిపండు, కృష్ణానది, టెలివిజన్... ఇలాంటి పాఠ్యాంశాలు ఎంతవరకు దోహదపడ్డాయో తెలియదుగానీ విద్యాభ్యాస కాలంలో టెన్త్ తప్పిన స్టూడెంట్ అన్న ముద్ర మాత్రం పడింది.

ముందుకురికే కాలంలో శ్రేయస్ ఎన్ని విజయసోపానాలు అధిగమించినా అతనికి ఆ ముద్ర తాలూకు మచ్చ లీలగా కనబడుతూనే వుంది. ★



## అశాశ్వతం

'యువ నటులకి మీరే ఆదర్శం అంటున్నారు?' అని షారూక్‌ని అడిగితే 'అలాంటిదేం లేదు. నేనో నటుడిని మాత్రమే. ఆయా సినిమాల్లో పాత్రల్ని బట్టి నటించాల్సి ఉంటుంది. అంతేగానీ నా నటన శాశ్వతం కాదు. ఆయా పాత్రలు ముగిసేసరికి అది పూర్తయిపోతుంది. కాబట్టి నన్ను ఆదర్శంగా తీసుకోవడం అనేది ఆయా నటుల వ్యక్తిగత అభిప్రాయం' అంటున్నాడు షారూక్. 'సినిమాలో ఫలానా పాత్రలో నేను తాగుబోతుని అయితే యువనటులు కూడా తాగాలి కదా. నన్ను ఆదర్శం అనుకునేవారు నేను చేసే పనులు కూడా చేస్తారు. అలాంటప్పుడు ఇలాంటి ఆదర్శాల గురించి పట్టించుకోకుండా ఉంటే మంచిది' అని సలహా ఇస్తున్నాడు ఎస్సార్కె.

